

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

జన స్వరం పవర్

అక్షరమే ఆయుధం ✍

www.janaswaram.com

పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 06 | సంచిక : 95 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 06-11-2026 | పేజీలు : 6

పోటెత్తిన పల్లె ఓటరు



- రాష్ట్రవ్యాప్తంగా 70 శాతం పైగా పోలింగ్..

- మున్సిపోల్స్ కంటే 8శాతం అధికం

- మొత్తం 578 జడ్పీటీసీ, 7724 ఎంపీటీసీలకు ఓటింగ్

- పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలిన జనం

- విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచీ వచ్చిన ఓటర్లు

- గ్రామాలకు మళ్లిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

- విశాఖ జిల్లాలో అత్యధికంగా 83.53శాతం పోలింగ్

- అతి తక్కువగా శ్రీకాకుళం జిల్లాలో 57.30 శాతం


- వేర్వేరు కారణాలతో వాయిదా పడినచోట నేడు పోలింగ్

అమరావతి, నవంబరు 5 (జనస్వరం) : పల్లె ఓటరులో చైతన్యం వెల్లివిరిసింది. ఓటేయడానికి పట్టణ ఓటర్ల కంటే గ్రామీణులు అధిక ఉత్సాహం చూపారు. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. అర్ధరాత్రి వరకు అందిన వివరాల ప్రకారం.. సుమారు 70.30 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 1న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 62.16శాతం ఓటింగ్ మాత్రమే జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో అంతకంటే 8.14 శాతం ఎక్కువగా పోలింగ్ నమోదవడం విశేషం. అయితే మురసు తుఫాను ప్రభావిత జిల్లాల్లో ఇంకా సాధారణ పరిస్థితులు నెలకొనకపోవడం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగకపోవడం.. పోలింగ్ కేంద్రాలు, రహదారులు వరద ముంపులోనే ఉండడం.. మొదలైన కారణాలతో అక్కడ తక్కువ ఓటింగ్ జరిగింది. లేదంటే పోలింగ్ శాతం మరింత పెరిగి ఉండేది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 77 జడ్పీటీసీలు, 2051 ఎంపీటీసీలు ఏకగ్రీవం కాగా.. మిగిలిన 582 జడ్పీటీసీ, 7767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగాల్సి ఉంది. వీటిలో 578 జడ్పీటీసీ, 7724 ఎంపీటీసీ స్థానాలకు మాత్రమే గురువారం పోలింగ్ జరిగింది. మొత్తం 2.55 కోట్ల మంది ఓటర్లకు గాను గురువారం రాత్రి 10.30 గంటల సమయానికి 1.79 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తుఫాన్ ప్రభావంతో ఏలూరు జిల్లా వేలేరుపాడు, బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో 4 జడ్పీటీసీ, 43 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను శుక్రవారానికి వాయిదా వేశారు. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 83.53 శాతం మంది ఓట్లేయగా.. అతి తక్కువగా శ్రీకాకుళం జిల్లాలో 57.30శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా.. రాష్ట్రంలో కొన్నిచోట్ల బూత్‌ల స్వాధీనం వంటి ఘటనలతో ఆయా చోట్ల శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లా కోసిగి జడ్పీటీసీ స్థానంలో ఆర్లబండ రెండో నంబర్ పోలింగ్ కేంద్రంలో, అనంతపురం జిల్లా కూడేరు మండలం మారుట్ల 8వ నంబర్ పోలింగ్ బూత్‌లో.. ఇదే జిల్లా పెద్దవడుగూరు మండలం చిత్రచేడులోని 46,47 నంబర్ల పోలింగ్ బూత్‌లలో, శ్రీకాకుళం మండలం పొన్నం రెండో నంబర్ పోలింగ్ కేంద్రంలో, మార్కాపురం జిల్లా పుల్లలచెరువు జడ్పీటీసీ పరిధిలో గంగవరం ఐదో నంబర్ పోలింగ్ బూత్‌లో.. మొత్తం 6 పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం మళ్లీ పోలింగ్ జరగనుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓ ప్రకటన విడుదల చేసింది.


గోదారి ఓటింగ్‌కు తుఫాను దెబ్బ :

పరిషత్ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పోలింగ్ శాతం తగ్గిపోయింది. వరుసగా అర్నబ్, మురసు తుఫాన్లు ఉమ్మడి జిల్లాపై తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో గడచిన మూడ్రోజుల్లో కురిసిన అతి భారీ వర్షాలకు ఎక్కడికక్కడ వరద నీరు చుట్టుముట్టింది. పోలింగ్ ప్రారంభమైన సమయానికి కూడా బూత్‌లకు వెళ్లే దారుల్లో వరద ముంపు తగ్గలేదు. దీంతో చాలా మంది ఇళ్ల నుంచి కదల్లేదు. కాకినాడ జిల్లాలో ఆరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. కోనసీమ జిల్లాలో తుఫాను ధాటికి వేలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఇప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ ఇబ్బందుల్లో ఓటువేయడానికి కొందరు నిరాసక్తత కనబరిచారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల స్లిప్పులు కూడా పూర్తిగా ఓటర్లకు అందలేదు. ఇవన్నీ కలిపి ఈ జిల్లాలో తక్కువ పోలింగ్ శాతం నమోదవడానికి కారణమయ్యాయి.

జీవితం - ని"చ్చితం"







జనస్వరం

విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం: 7013030690

మేనేజింగ్ డైరెక్టర్

జనస్వరం మీడియా

ఓటు బ్యాంకుకు బీటలు.. వైసీపీలో గుబులు!

- పట్టణ ఓటరులో మారిన రాజకీయ ఆలోచన..

- కూటమికి 60.34 శాతం ఓట్లు

- 34.30 శాతానికే పరిమితమైన వైసీపీ..

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరింత క్షీణించిన ఆదరణ

- కీలక కార్పొరేషన్లలోనూ తగ్గిన బలం..

- జగన్‌కు పెరుగుతున్న రాజకీయ సవాళ్లు



ఒకప్పుడు తమకు తిరుగులేదని, తమ ఓటు బ్యాంకుకు ఢోకా లేదని ధీమా వ్యక్తం చేసిన వైసీపీకి తాజా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు గట్టి హెచ్చరిక పంపించాయి. ఎన్నికల్లో నమోదైన ఓట్ల సరళిని చూస్తే వైసీపీ రాజకీయ పునాదులు క్రమంగా బలహీనపడుతున్నాయనే విషయం స్పష్టమవుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఆ పార్టీకి ఉన్న ఆదరణ గణనీయంగా తగ్గడం రాజకీయంగా ఆసక్తికర పరిణామం. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజల్లో తమపై అభిమానం చెక్కుచెదరలేదని భావించిన వైసీపీ నాయకత్వానికి ఈ ఫలితాలు వాస్తవ పరిస్థితిని గుర్తు చేస్తున్నాయి. మాటలు కోటలు దాటినా.. ఓట్లు మాత్రం ప్రజల మనసులో ఏముందో చెబుతాయి. తాజా గణాంకాలు కూడా అదే విషయాన్ని చాటుతున్నాయి.

ఓట్ల లెక్కలోనే కనిపిస్తున్న ప్రజాభిప్రాయం! :

ఏపీలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోలైన చెల్లుబాటు ఓట్లను పరిశీలిస్తే ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం ఓట్లలో కూటమి ఏకంగా 60.34 శాతం ఓట్లను సాధించి తన బలాన్ని నిరూపించుకుంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కేవలం 34.30 శాతం ఓట్లకే పరిమితమైంది. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసం సాధారణమైనది కాదు. దాదాపు 26 శాతం ఓట్ల అంతరం కనిపిస్తుండటం రాజకీయంగా గమనించాల్సిన అంశం. ఇది కేవలం కొన్ని స్థానాల్లో వచ్చిన విజయాపజయాల లెక్క కాదు. పట్టణ ఓటరు ఎటువైపు నిలుస్తున్నాడో తెలియజేసే రాజకీయ సంకేతం. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత వైసీపీ తన పరిస్థితిని చక్కదిద్దుకుని తిరిగి పుంజుకుంటుందని ఆ పార్టీ శ్రేణులు ఆశించాయి. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తే తమకు మళ్లీ ఆదరణ పెరుగుతుందని భావించాయి. కానీ తాజా ఎన్నికల గణాంకాలు ఆ అంచనాలకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ఏర్పడిన రాజకీయ బలం, అధికారం కోల్పోయిన తర్వాత కూడా అదే స్థాయిలో కొనసాగుతుందని అనుకోవడం పొరపాటే నని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. ప్రజల తీర్పును అర్థం చేసుకుని లోపాలను సరిదిద్దుకోవాల్సిన సమయంలో విమర్శలకే పరిమితమైతే రాజకీయంగా మరింత నష్టపోవాల్సి వస్తుంది.

తిరుపతిలో కూటమి జైత్రయాత్ర..అనంతపురంలోనూ వైసీపీకి గట్టి పోటీ!:

కార్పొరేషన్ల వారీగా ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. తిరుపతిలో ఏకంగా 71.45 శాతం ఓట్లను సాధించడం కూటమి సాధించిన ఘనమైన విజయంగా చెప్పుకోవచ్చు. అక్కడ వైసీపీ ఓట్ల శాతం కేవలం 25.10కే పడిపోయింది. ఒకప్పుడు బలమైన రాజకీయ స్థావరాలుగా భావించిన ప్రాంతాల్లోనూ ఓటరు వైఖరి మారుతోందనడానికి ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి. తిరుపతిలో వచ్చిన ఫలితం కూటమికి రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని ఇస్తే, వైసీపీకి మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. ఇక కూటమికి అత్యల్పంగా ఓట్లు వచ్చిన అనంతపురంలోనూ 43.65 శాతం ఓట్లను సాధించింది. అదే సమయంలో అక్కడ వైసీపీ 48.29 శాతం ఓట్లతో తన అత్యధిక స్థానాన్ని నిలబెట్టుకుంది. అయితే ఒక్క అనంతపురంలో వచ్చిన ఈ ఆధిక్యాన్ని చూపించి రాష్ట్రవ్యాప్తంగా తమకు ఆదరణ ఉందని వైసీపీ చెప్పుకోలేని పరిస్థితి. ఎందుకంటే మిగిలిన కార్పొరేషన్లలో నమోదైన ఓట్ల శాతం మరో కథ చెబుతోంది. ఒకటి రెండు ప్రాంతాల్లో నిలదొక్కుకున్నంత మాత్రాన రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పునాదులు బలంగా ఉన్నట్లు కాదు. మొత్తం ఫలితాలను కలిపి చూసినప్పుడే ప్రజాభిప్రాయంలో వచ్చిన మార్పు అర్థమవుతుంది.

కీలక నగరాల్లోనూ తగ్గిన వైసీపీ ప్రభావం! :

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కడప వంటి కీలక కార్పొరేషన్లలో వైసీపీ ఓట్ల శాతం గణనీయంగా తగ్గడం ఆ పార్టీకి మరో ఆందోళనకర పరిణామం. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల ఆలోచనా విధానం, అభివృద్ధిపై వారి అంచనాలు, పాలనపై వారి అభిప్రాయాలు ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబిస్తాయి. ఆయా నగరాల్లో వైసీపీకి ఆశించిన స్థాయిలో ఓట్లు రాకపోవడం వెనుక అనేక రాజకీయ, పాలనాపరమైన అంశాలు ఉండవచ్చు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ ఓటరును ఆకట్టుకోవడంలో వైసీపీ వెనుకబడుతోంది. పట్టణ ప్రాంతాల్లో రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. కేవలం రాజకీయ విమర్శలతోనే ప్రజల ఆదరణను తిరిగి సంపాదించలేరు. తమ ప్రాంతానికి ఏం కావాలి? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? వాటికి ఎవరు పరిష్కారం చూపగలరు? అనే అంశాల ఆధారంగానే పట్టణ ఓటరు తన నిర్ణయం తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో కూటమికి వచ్చిన 60.34 శాతం ఓట్లు పట్టణ ప్రజల్లో ఆ కూటమిపై ఏర్పడిన సానుకూలతకు రాజకీయ బలాన్ని ఇస్తున్నాయి.

ఓటమి నుంచి పాఠం నేర్చుకోని వైసీపీ! :

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ ఓటమి తర్వాత కూడా తప్పులను గుర్తించకపోవడం, ప్రజల మనోభావాలను అర్థం చేసుకోకపోవడం ఏ పార్టీకైనా ప్రమాదకరమే. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ తన రాజకీయ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేయడం, ప్రజలకు చేరువ కావడం, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపడం వంటి చర్యలపై దృష్టి పెట్టాల్సి ఉంది. కానీ నాయకత్వం నుంచి వస్తున్న రాజకీయ సందేశాలు ప్రజల్లో ఎంతవరకు ప్రభావం చూపుతున్నాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు ఒకసారి తీర్పు ఇచ్చిన తర్వాత ఆ తీర్పును గౌరవించి, తమ పనితీరును మెరుగుపరుచుకోవడం ప్రతిపక్ష బాధ్యత. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో అవసరమే. అయితే ప్రతి అంశాన్నీ రాజకీయ విమర్శలకే పరిమితం చేస్తే ప్రజలు వాటిని ఎంతవరకు స్వీకరిస్తారన్నది కూడా ఆలోచించాలి. ప్రజలకు కావాల్సింది కేవలం ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదు. తమ సమస్యలపై స్పందించే నాయకత్వం, అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ. ఈ ప్రాథమిక అంశాలను విస్మరిస్తే ఓటు బ్యాంకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది.

కూటమికి పెరిగిన బాధ్యత.. వైసీపీకి ఆత్మపరిశీలన సమయం! :

తాజా ఫలితాలు కూటమికి విజయోత్సాహాన్ని ఇచ్చినప్పటికీ, అదే సమయంలో బాధ్యతను కూడా పెంచాయి. ప్రజలు ఇచ్చిన మద్దతును నిలబెట్టుకోవాలంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం, పట్టణ సమస్యలకు పరిష్కారం చూపడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం అవసరం. 60.34 శాతం ఓట్లు సాధించామనే ధీమాతోనే సరిపెట్టుకుంటే కుదరదు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని పాలనలో ప్రతిబింబించాలి. ఓటరు ఇచ్చిన అధిక్యం పాలకులకు ప్రశంస మాత్రమే కాదు.. మరింత మెరుగైన పనితీరును ఆశిస్తున్నాడనే సంకేతం కూడా. మరోవైపు వైసీపీకి ఈ ఫలితాలు సాధారణ రాజకీయ ఎదురుదెబ్బగా తీసుకునే అంశాలు కావు. 34.30 శాతం ఓట్లతో సరిపెట్టుకోవడం, కీలక నగరాల్లోనూ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడం ఆ పార్టీ భవిష్యత్ రాజకీయాలకు సవాలుగా మారే అవకాశం ఉంది. పార్టీ నాయకత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అంగీకరించి, క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఒక ఎన్నికలో వచ్చిన ఎదురుదెబ్బ మరో ఎన్నికలోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంటుంది.

ప్రజల తీర్పే అంతిమం! :

మొత్తానికి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల శాతం ఏపీ రాజకీయాల్లో మారుతున్న సమీకరణాలను స్పష్టం చేస్తోంది. ఒకవైపు 60.34 శాతం ఓట్లతో ఎన్డీఏ కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంటే, మరోవైపు 34.30 శాతానికే పరిమితమైన వైసీపీ తన రాజకీయ బలాన్ని తిరిగి నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో పడింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వచ్చిన ఫలితాలు ఆ పార్టీకి హెచ్చరిక గంటలు మోగిస్తున్నాయి. రాజకీయాల్లో ప్రజల జ్ఞాపకశక్తి తక్కువని, ఎన్నికల సమయానికి పరిస్థితులు మారిపోతాయని అనుకోవడం నాయకుల పొరపాటు. ప్రజలు తమ అనుభవాల ఆధారంగానే తీర్పు ఇస్తారు. ఆ తీర్పును మాటలతో మార్చలేరు.. చేతలతోనే మార్చుకోవాలి. తాజా ఎన్నికల్లో వైసీపీకి ఎదురైన పరిస్థితి కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తోంది. అధికారం ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోకపోతే, అధికారం లేనప్పుడు ప్రజలు పట్టించుకోరన్న రాజకీయ వాస్తవాన్ని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఓటు బ్యాంకు అనేది శాశ్వత ఆస్తి కాదు.. ప్రజల నమ్మకమే ఏ రాజకీయ పార్టీకైనా అసలైన బలం!

ఎడిటోరియల్

జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్ట్,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



పొన్నవరం, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) గురువారం తన స్వగ్రామమైన పొన్నవరంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. దేశాభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసే నాయకులను ఎన్నుకునేందుకు ఓటు చక్కటి అవ కాశమని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని సుజనా చౌదరి అన్నారు. కూటమి పట్ల ప్రజల్లో ఉత్సాహం, సానుకూల స్పందన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు.

మాజీ ఐఏఎస్ అధికారి డి.సి. రోశయ్యకు వర్ల రామయ్య నివాళులు



గుంటూరు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : జిల్లాలోని సిరిపురం గ్రామంలో స్వర్గస్తులైన మాజీ ఐఏఎస్ అధికారి డి.సి. రోశయ్య పార్థివదేహాన్ని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ పరిపాలనలో ఐఏఎస్ అధికారిగా సేవలందించిన డి.సి. రోశయ్య మృతి పట్ల వర్ల రామయ్య విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని రోశయ్యకు నివాళులర్పించారు.

మేయర్ రాధాకృష్ణకు సుజనా చౌదరి అభినందనలు

విజయవాడ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి



విజయవాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : విజయవాడ నగర మేయర్‌గా ఘనవిజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణ గురువారం కానూరులోని ఎమ్మెల్యే సుజనా చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జి.వి. కృష్ణారావు నూతన మేయర్ వంగవీటి రాధాకృష్ణను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్న రాధాకృష్ణకు సుజనా చౌదరి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. విజయవాడ నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నగరంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మేయర్‌గా లభించిన విజయాన్ని బాధ్యతగా భావించి, నగర ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సుజనా చౌదరి సూచించారు. ప్రజలు ఆశించిన అభివృద్ధి ఫలాలను అందించేందుకు అంకితభావంతో కృషి చేయాలని రాధాకృష్ణకు హితవు పలికారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ సుజనా చౌదరి, జి.వి. కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిషత్ పోరులో వైసీపీపై ఫిర్యాదుల అస్త్రం!

- చంద్రగిరిలో చెవిరెడ్డి అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడి బెదిరింపులు

- పులివెందుల ఓటమి భయంతోనే వైసీపీ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారు

- ఎన్నికల సంఘానికి వీడియో ఆధారాలతో ఫిర్యాదు

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్



మంగళగిరి, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్పడుతున్నారని ఆరోఎస్తున్న దౌర్జన్యాలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై కూటమి నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్‌లు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఏ. మల్లికార్జున, ఐజీ రాజకుమారిలకు సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. సంతనూతలపాడు, సత్తెనపల్లి, చీరాల, చంద్రగిరి, పులివెందుల నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న ఘటనలను వివరించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సుమారు 40 నుంచి 50 మంది అనుచరులతో కలిసి ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పులివెందులలోని పలు ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులు, కార్యకర్తలపై పెట్రోల్ బాంబులతో దాడులు, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను అధికారులకు అందజేశారు. రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకుంటున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా తగిన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అధికారం కోల్పోయిన వైసీపీ తీవ్రమైన ఓటమి భయంతో పలు ప్రాంతాల్లో అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగకుండా పోలింగ్ ప్రక్రియను దెబ్బతీసేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియో ఆధారాలను ఎన్నికల సంఘం కార్యదర్శికి స్వయంగా అందజేశామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లు సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని అదుపులోకి తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో పరాజయం ఎదుర్కొన్న వైసీపీ, ప్రస్తుత పరిషత్ ఎన్నికల్లోనూ ఓటమి తప్పదనే ఆందోళనతో అడ్డంకులు సృష్టిస్తోందని నసీర్ అహ్మద్ ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని సప్తగిరి నగర్ పరిధిలో ఉన్న మంగళం పోలింగ్ కేంద్రంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన అనుచరులతో ప్రవేశించి ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించారని విమర్శించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని కందులవారి అగ్రహారం, బండ్లమూడి ప్రాంతాల్లో ఓటర్లను, స్థానికులను భయపెడుతూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ యానం శేషారెడ్డి, పొన్నపాటి ప్రసాద్ రెడ్డి, దేవరపల్లి రామారావు, ఎన్.ఎం. నాగరాజు వంటి నేతలు బయట తిరుగుతూ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన సొంత వార్డులో ఓటు హక్కును వినియోగించుకోకుండా బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నసీర్ అహ్మద్ విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాల పేరుతో వ్యవహరించిన వైసీపీ, ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులను అడ్డుకుంటోందని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను కూర్చోబెట్టకుండా రోడ్లపై ఆందోళనలు చేస్తూ ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరుగుతున్నా ఓటమి భయంతో పోలింగ్‌కు ఆటంకాలు కలిగించడం వైసీపీ రాజకీయ వైఖరికి నిదర్శనమన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపిన నేపథ్యంలో అదే పరిస్థితి పరిషత్ ఎన్నికల్లోనూ ఎదురవుతుందనే భయంతో వైసీపీ నాయకులు ఎన్నికలను చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించడం, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకోవడం లక్ష్యంగా పలు ప్రాంతాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించిన జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఏకగ్రీవం కాకుండా అడ్డుకోవాలని పార్టీ శ్రేణులను రెచ్చగొడుతున్నారని గళ్ళా మాధవి ఆరోపించారు. తన ఓటు హక్కును కూడా వినియోగించుకోని జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. చీరాల, సత్తెనపల్లి, పులివెందుల వంటి నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు అనుచరులతో కలిసి వచ్చి ఓటర్లను బెదిరిస్తున్నారని, టీడీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతూ అశాంతి సృష్టిస్తున్నారని ఆరోపించారు. వాహనాల్లో తిరుగుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్నట్లు ఆధారాలను ఎన్నికల సంఘం అధికారులకు చూపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసుకునే హక్కును ఎవరూ అడ్డుకోకూడదని స్పష్టం చేశారు. ఓటమి భయంతో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు సృష్టించడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులందరిపైనా ఉందని పేర్కొన్నారు. పులివెందులలో వైసీపీకి ఎదురైన రాజకీయ ఎదురుదెబ్బతో ఆ పార్టీ నాయకులు మరింత అసహనానికి గురవుతున్నారని, అందుకే పరిషత్ ఎన్నికల్లోనూ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని బుచ్చిరాం ప్రసాద్ అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛాయుత ఎన్నికల వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉందని, ఎన్నికల సంఘం కూడా ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత ఏర్పాటు చేసి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, పార్టీలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరగాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గళ్ళా మాధవి గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుంటే వైసీపీ మాత్రం అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎన్నికల సంఘం అధికారులు ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రజలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల్లోనూ తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా వ్యక్తం చేస్తారని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి



- కార్పొరేటర్లకు ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచన..

- కూటమి నేతలతో సమన్వయంగా పనిచేయాలని పిలుపు

విజయవాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉండాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమి కార్పొరేటర్లు గురువారం భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో ఎమ్మెల్యే సుజనా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి అభినందనలు తెలిపి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా కార్పొరేటర్లు పనిచేయాలన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్పొరేటర్లు పరస్పర సమన్వయంతో పని చేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అడ్డూరి శ్రీరామ్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), గద్దం బాల వెంకట రవికుమార్, ఏలూరు సాయి శరత్, గుడపాటి కిషోర్, పత్తి నాగేశ్వరరావు, కొండా జమలయ్య, బెవర జోగేశ్వర రావు, ఈగల సాంబశివరావు, అబ్దుల్ అకీబ్ అర్షద్, పెద్ది రమేష్, కొలగాని అశోక్, కే. శ్రీమణి జ్యోతి, గుర్రం కనకదుర్గ, కుంచం శ్యామల, శీలం స్వర్ణలత, గూడె లక్ష్మీ బసవ పూర్ణిమ, కిలారు నాగ శ్రావణ్, ఆవాల అరుణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేళ టపాసుల విక్రయాలపై పోలీసుల నిఘా

- అనుమతులు లేకుండా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

- వ్యాపారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ డి. అశోక్

హైదరాబాద్, నవంబర్ 5 (జనస్వరం) : దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల విక్రయాలు, నిల్వలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. అశోక్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచినా, విక్రయాలు చేపట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు ముందస్తు అనుమతులు పొందడంతో పాటు అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దీపావళి సందర్భంగా టపాసుల విక్రయాలు చేపట్టే ప్రతి వ్యాపారి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. అనుమతులు మంజూరైన నిర్దేశిత ప్రదేశాల్లోనే విక్రయాలు నిర్వహించాలని, నివాస ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల్లో అనధికారికంగా టపాసులను నిల్వ చేయకూడదని తెలిపారు. అధిక మొత్తంలో టపాసులను ఒకేచోట నిల్వ చేయడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఈ విషయంలో వ్యాపారులు నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తప్పనిసరి :

టపాసుల విక్రయ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డి. అశోక్ సూచించారు. ప్రతి దుకాణంలో పనిచేసే స్థితిలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, నీటి సదుపాయం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా వైరింగ్, విద్యుత్ పరికరాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దుకాణాల వద్ద బహిరంగ మంటలు, వెలిగించిన దీపాలు, అగరబత్తులు, పొగ తాగే కార్యకలాపాలను అనుమతించకూడదని స్పష్టం చేశారు. టపాసులు నిల్వ ఉంచే ప్రదేశాల్లో మండే స్వభావం కలిగిన ఇతర వస్తువులను ఉంచరాదని సూచించారు. విక్రయ కేంద్రాల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు సులభంగా చేరుకునేలా తగినంత స్థలం ఉండాలని తెలిపారు.



ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి :

దీపావళి వేడుకల సందర్భంగా ప్రజలు కూడా భద్రతా నియమాలను పాటించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. టపాసులు కాల్చేటప్పుడు బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవాలని, చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చేలా చూడాలని సూచించారు. టపాసులు కాల్చే ప్రదేశంలో ముందస్తుగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, కాలిన టపాసులను వెంటనే చేతులతో తాకరాదని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల సమీపంలో టపాసులు కాల్చకూడదని సూచించారు. ప్రమాదకరమైన టపాసులను నిర్లక్ష్యంగా ఉపయోగించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు :

దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జరుపుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని డి. అశోక్ తెలిపారు. వ్యాపారులు, ప్రజలు పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు. అనుమతులు లేకుండా టపాసులను నిల్వ చేసినా, విక్రయించినా లేదా భద్రతా నిబంధనలను ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని, తనిఖీల్లో పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మాజీ మంత్రి తోట నరసింహం

వీరవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న తోట నరసింహం, తోట రాంజీ



కిర్లంపూడి, నవంబర్ 5 (జనస్వరం) : వీరవరంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మాజీ మంత్రి, జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీతో పాటు కుటుంబ సభ్యులు కూడా వీరవరంలో ఓటు వేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ, బలోపేతంలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం తోట నరసింహం, తోట రాంజీ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకం..

- ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

- ప్రత్తిపాడులో ఓటు హక్కు వినియోగించుకున్న యాళ్ల మంగాదేవి, జగదీష్



ప్రత్తిపాడు, నవంబర్ 5 (జనస్వరం) : ప్రత్తిపాడులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో ప్రత్తిపాడు ఎంపీపీ, ఎంపీటీసీ-3 అభ్యర్థి యాళ్ల మంగాదేవి, ఎంపీటీసీ-2 అభ్యర్థి యాళ్ల జగదీష్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం పోలింగ్ సందర్భంగా ఇద్దరూ ఓటు వేసిన అనంతరం తమ చేతి వేలిపై ఉన్న సిరా గుర్తుతో ఫోటో దిగారు. ఈ సందర్భంగా యాళ్ల మంగాదేవి, యాళ్ల జగదీష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని పేర్కొంటూ, మండలంలోని అర్హులైన ఓటర్లందరూ ఎన్నికల్లో భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉధృత వరదలోకి దూకి ముగ్గురు మహిళల ప్రాణాలు కాపాడిన సీఐ సుబ్బనాయుడు

- ప్రాణాలకు తెగించి సాహసోపేతంగా రక్షించిన చిలకలూరిపేట రూరల్ పోలీసులు..

- హోంమంత్రి అనిత ప్రశంసలు



అమరావతి, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముగ్గురు మహిళలను ఉధృత వరద ప్రవాహం నుంచి కాపాడిన చిలకలూరిపేట రూరల్ పోలీసులు సాహసోపేత చర్యతో అందరి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట పరిధిలోని తిమ్మాపురం అండర్‌పాస్ వద్ద నిన్న వరద నీటిలో చిక్కుకున్న ముగ్గురు మహిళలను పోలీసులు సురక్షితంగా కాపాడారు. తిమ్మాపురం అండర్‌పాస్ వద్ద ముగ్గురు మహిళలు వరద ప్రవాహంలో చిక్కుకున్నట్లు సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో మహిళలను బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. అయినప్పటికీ వారి ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో సీఐ సుబ్బనాయుడు సాహసానికి సిద్ధమయ్యారు. తన నడుముకు తాడు కట్టుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలోకి దూకి మహిళల వద్దకు చేరుకున్నారు. పోలీసు సిబ్బంది సహకారంతో ఎంతో సమన్వయంతో ముగ్గురు మహిళలను ఒక్కొక్కరిగా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సీఐ సుబ్బనాయుడు చూపిన ధైర్యసాహసాలు, సిబ్బంది సమయస్ఫూర్తితో ముగ్గురు మహిళలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత పోలీసుల సాహసోపేత చర్యను అభినందించారు. విధి నిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వరద ప్రవాహంలో చిక్కుకున్న మహిళలను కాపాడిన సీఐ సుబ్బనాయుడు, ఆయన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల ప్రాణాలను రక్షించడంలో పోలీసులు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని హోంమంత్రి అనిత ప్రశంసించారు.

ఉద్రిక్తతల మధ్య పోలింగ్.. ఎర్రిపల్లిలో పెట్రోల్ బాంబులతో దాడులు

- పలు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు

- రాళ్ల దాడులు, తోపులాటలతో కలకలం..

- రంగంలోకి దిగిన పోలీసులు





పులివెందుల, నవంబర్ 5 (జనస్వరం) : నియోజకవర్గంలో జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం పలు ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో కొంతసేపు ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఎర్రిపల్లి గ్రామంలో పెట్రోల్ బాంబులతో దాడులు జరిగినట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆర్. తుమ్మలపల్లిలో జరిగిన రాళ్ల దాడిలో వైసీపీ కార్యకర్త కృష్ణారెడ్డి గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్నపల్లెలో పోలింగ్ ఏజెంట్ల నియామకం, వారి విషయంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. గుండ్లకుంటలోనూ ఇరువర్గాల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఎర్రిపల్లి గ్రామంలో స్థానికేతరులు వచ్చారంటూ వివాదం మొదలైందని, ఈ క్రమంలో వైసీపీ శ్రేణులు పెట్రోల్ బాంబులతో దాడులకు దిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్లు, కర్రలతో దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసుల తీరుపైనా అక్కడక్కడ ఆరోపణలు రావడంతో అధికారులు పరిస్థితిని సమీక్షించారు. వరుస ఘర్షణల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎర్రిపల్లిలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు బలగాలను రంగంలోకి దించి ఇరువర్గాలను చెదరగొట్టారు. పోలింగ్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడక్కడ స్వల్ప సంఘటనలు, ఘర్షణలు మినహా పోలింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి పరిస్థితి అదుపులోకి రావడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చిల్లపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్ కొండూరు సమత

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం కృతజ్ఞతలు తెలిపిన జనసేన కార్పొరేటర్



గుంటూరు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : ఇటీవల జరిగిన గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా 67వ డివిజన్ నుంచి ఘన విజయం సాధించిన కార్పొరేటర్ కొండూరు సమత గురువారం మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఎం ఎస్ఐడీసీ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తనకు లభించిన విజయాన్ని పురస్కరించుకుని చిల్లపల్లి శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో అందించిన సహకారం, ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. 67వ డివిజన్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని సమత తెలిపారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు కొండూరు సమతకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డివిజన్ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

అంబికా కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ రెడ్డి అప్పలనాయుడు

సోదరుడు అంబికా రాజాతోనూ ఆత్మీయ భేటీ



ఏలూరు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : ఏలూరు మాజీ శాసనసభ్యులు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు అంబికా కృష్ణ, ఆయన సోదరుడు అంబికా రాజాలను ఏలూరు నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు గురువారం సాయంత్రం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఏలూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి తరఫున రెడ్డి అప్పలనాయుడు విజయం సాధించి, త్వరలో మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా అంబికా కృష్ణ, అంబికా రాజాలతో రెడ్డి అప్పలనాయుడు ఆత్మీయంగా మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జనసేన పార్టీ నగర అధ్యక్షులు వీరంకి పండు, నాయకులు రెడ్డి గౌరీశంకర్, ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగిరెడ్డి కాశీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల మద్దతు.. స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

- అగర్తిపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు

- ప్రజల్లో ప్రభుత్వంపై భరోసా, భద్రత, నమ్మకం.. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ లబ్ధి

- తుఫాన్ బాధిత రైతులకు హెక్టారుకు రూ.25 వేల పరిహారం



పాలకొల్లు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు విస్తృత మద్దతు తెలుపుతున్నారని, పోలింగ్ సరళి కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఏకపక్షంగా ఉండబోతోందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం పాలకొల్లు నియోజకవర్గంలోని తన స్వగ్రామం అగర్తి పాలెంలో మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాధారణ ఓటరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన తన ఓటు హక్కును వినియోగించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో భరోసా, భద్రత, నమ్మకం, విశ్వాసం ఉన్నాయని మంత్రి నిమ్మల తెలిపారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తీవ్ర సంక్షోభంలోకి నెట్టి, అప్పుల భారాన్ని వారసత్వంగా అప్పగించిందని విమర్శించారు. అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ పరిపాలనా దక్షత కలిగిన సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు ఆర్థిక భరోసా కల్పించడం, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందించడం, ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు తక్కువ ధరకు భోజనం అందించడం వంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఈ సంక్షేమ పథకాలతో ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత పెరిగిందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే 'రఫా రఫా' అంటూ హింసను ప్రేరేపిస్తూ అరాచకాలకు పాల్పడుతుందనే ఆందోళన ప్రజల్లో ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ నిర్ణయాన్ని ఓటు ద్వారా వెల్లడిస్తున్నారని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు స్పష్టమవుతోందని, ఫలితాల్లోనూ ఇదే ప్రతిఫలిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఒకేసారి రెండు తుఫాన్లు విరుచుకుపడిన క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందస్తు చర్యలు చేపట్టి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని మంత్రి తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలవడం, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన వరి రైతులను ఆదుకునేందుకు హెక్టారుకు రూ.16 వేలుగా ఉన్న పంట నష్టపరిహారాన్ని రూ.25 వేలకు పెంచి అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. వరి పంటతో పాటు కొబ్బరి, అరటి తోటలకు జరిగిన నష్టాన్ని, ఇళ్ల నష్టాన్ని కూడా సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో నష్టాలను పరిశీలించి అర్హులైన బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారులు, చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల బియ్యంతో పాటు ఐదు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన ఇతర వర్గాల కుటుంబాలకు కూడా 10 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, విపత్తుల నిర్వహణలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా వెల్లడిస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

నక్కపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న హోంమంత్రి అనిత

- సాధారణ ఓటరుగా క్యూలైన్‌లో నిలబడి ఓటు వేసిన మంత్రి..

- అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు



నక్కపల్లి, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం నక్కపల్లిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 209వ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆమె సాధారణ ఓటరుగా క్యూలైన్‌లో నిలబడి తన ఓటు వేశారు. ప్రజాప్రతినిధిగా కాకుండా సామాన్య ఓటరుగా క్యూలో నిలబడి ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సమానమేనని సందేశాన్ని చాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో భాగస్వాములై తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాలని సూచించారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడిపై ఉన్న బాధ్యత అని ఆమె అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతుందని పేర్కొన్నారు. అనంతరం హోంమంత్రి అనిత ఉపమాక గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ తీరును, పోలింగ్ ప్రక్రియను గమనించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

"సామాన్యుడు"గా ఓటు వేసిన మంత్రి అచ్చెన్నాయుడు

- కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగం..

- ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు



నిమ్మాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : అధికార హోదా కంటే ప్రజాస్వామ్య విలువలకే ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సామాన్య ఓటరుగా క్యూలైన్‌లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతను ఆశించకుండా ఇతర ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడి తన వంతు వచ్చే వరకు వేచి ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పింది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడంలో సామాన్యుడైనా, ప్రజాప్రతినిధైనా అందరూ సమానమేనని సందేశాన్ని తన ఆచరణ ద్వారా అచ్చెన్నాయుడు చాటి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలన్నారు. ఓటు అనేది కేవలం ఎన్నికల గుర్తుపై వేసే ముద్ర మాత్రమే కాదని, ప్రజల భవిష్యత్తును, సమాజ అభివృద్ధి దిశను నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది అని, ప్రతి ఓటుకు విలువ ఉంటుందని తెలిపారు. ఒక్క ఓటు కూడా ప్రజాతీర్పును ప్రభావితం చేయగలదని అన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ వంటివని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేయడం కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తు పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునే చైతన్యవంతమైన పౌరులతోనే బలమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలందరూ ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొని తమ ఓటు ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

గొల్లపూడిలో ఓటు హక్కు వినియోగించుకున్న దేవినేని ఉమా

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



గొల్లపూడి, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా గురువారం నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని సాయిపురం కాలనీలో ఏర్పాటు చేసిన 268వ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన తన ఓటు వేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు, కీలకమైన బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల ద్వారా ప్రజలు తమకు నచ్చిన నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 18 ఏళ్ల నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని, తమ విలువైన ఓటును వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే ఓటర్లు చైతన్యంతో తమ హక్కును వినియోగించుకోవాలని దేవినేని ఉమా సూచించారు.

ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు

- చివరి యాత్రలో పాల్గొని పాడె మోసిన మంత్రి నిమ్మల రామానాయుడు

- సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయించిన మంత్రి



పాలకొల్లు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం పాలకొల్లులోని డాక్టర్ బాబ్జి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. అనంతరం డాక్టర్ బాబ్జి అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి నిమ్మల స్వయంగా పాడె మోసి ఆయనతో తనకున్న అనుబంధాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. డాక్టర్ బాబ్జి వైద్య రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ విశిష్ట సేవలందించారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. వైద్యుడిగా ప్రజలకు సేవలందిస్తూ, ప్రజాప్రతినిధిగా పాలకొల్లు ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారని గుర్తుచేశారు. వివిధ రంగాల్లో ఆయన అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన వ్యక్తిగా, వైద్య సేవల ద్వారా ఎంతోమందికి అండగా నిలిచిన వ్యక్తిగా డాక్టర్ బాబ్జికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. డాక్టర్ బాబ్జి మరణవార్త తెలిసిన వెంటనే మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వైద్య రంగానికి, ప్రజా జీవితానికి ఆయన చేసిన సేవలకు తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశంతో అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సీఎంని కోరారు. మంత్రి చొరవతో సీఎం స్పందించి, ప్రత్యేక అనుమతి ఉత్తర్వులు జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. ఒక వైద్యుడిగా ప్రజలకు సేవలందించడంతో పాటు, ప్రజాప్రతినిధిగా సమాజానికి సేవ చేసిన వ్యక్తికి ప్రభుత్వం తరఫున తగిన గౌరవం లభించడం సముచితమని మంత్రి నిమ్మల అన్నారు. డాక్టర్ బాబ్జి వంటి విశిష్ట వ్యక్తుల సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఆయనకు గౌరవం ఇవ్వడం అంటే ఆయన అందించిన సేవలను, ప్రజా జీవితంలో పాటించిన విలువలను గౌరవించుకోవడమేనని అన్నారు. డాక్టర్ బాబ్జి అంతిమయాత్రలో మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా పాల్గొని పాడె మోయడం అక్కడికి వచ్చిన వారి దృష్టిని ఆకర్షించింది. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ప్రత్యేక ఉత్తర్వులు వచ్చేలా కృషి చేయడం ద్వారా ఆయనకు ప్రభుత్వ గౌరవం దక్కేలా మంత్రి చొరవ చూపారు. డాక్టర్ బాబ్జి మరణం పాలకొల్లు ప్రాంతానికి తీరని లోటుగా మిగిలిపోతుందని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

7వ డివిజన్ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని చిల్లపల్లికి వినతి

బయోడేటా అందజేసిన జనసేన వీరమహిళ శంకరశెట్టి రజని



మంగళగిరి, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : త్వరలో జరగనున్న మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో తాడేపల్లి పరిధిలోని 7వ డివిజన్ (ఇప్పటం) కార్పొరేటర్ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ జనసేన వీరమహిళ శంకరశెట్టి రజని చిల్లపల్లి శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఎంఎస్ఐడీసీ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్, జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కేంద్ర సమన్వయ కమిటీ సభ్యుడు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును పార్టీ నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన బయోడేటాను ఆయనకు అందజేసి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన శంకరశెట్టి రజని పార్టీ పట్ల తనకున్న నిబద్ధత, రాజకీయ అనుభవం, ప్రజలతో ఉన్న సంబంధాలను వివరించారు. 7వ డివిజన్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ తన అభ్యర్థనను చిల్లపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చిల్లపల్లి శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. అభ్యర్థి రాజకీయ అనుభవం, ప్రజాబలం, పార్టీ పట్ల నిబద్ధత తదితర అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. శంకరశెట్టి రజని అభ్యర్థిత్వానికి సంబంధించిన వివరాలను జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మూడోసారి కార్పొరేటర్‌గా గెలిచిన గుర్రం కనకదుర్గకు అభినందనలు

43వ డివిజన్‌లో విజయంపై ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు



విజయవాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : స్థానిక పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ నుంచి మూడోసారి కార్పొరేటర్‌గా విజయం సాధించిన గుర్రం కొండా సతీమణి గుర్రం కనకదుర్గకు స్థానిక 43, 44వ డివిజన్ల జనసేన నాయకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆమె సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకం, ఆదరణతో పాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు తెలిపారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. వరుసగా మూడో సారి కార్పొరేటర్‌గా విజయం సాధించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ప్రజలు అందించిన ఈ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి డివిజన్ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కరణం దివాకర్, బీసీ నాయకులు ఎరుపల్లి కనకరావు, పొట్నూరి శివశంకర్, రాళ్లపూడి గోవింద్, చలపాక డూండి సురేష్, దొడ్డి ఓంకార్, మురళి, రాంబాబు, బాల వెంకటేశ్వర రావుతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓడినా.. నైతిక విజయం వైసీపీదే!

- **ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గెలిచారు.. దొంగ ఓట్లతో టీడీపీ హవా**
- **పోలీసులను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ అరాచకాలు**
- **ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**



పులివెందుల, నవంబర్ 5 (జనస్వరం) : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఓటమి పాలైనా, తమ దృష్టిలో అది ఓటమి కాదని, నైతికంగా విజయం వైసీపీదేనని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్, జడ్పీటీసీ, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నామినేషన్ల దశ నుంచి పోలింగ్ ముగిసే వరకు టీడీపీ నాయకులు అడ్డదారులు తొక్కారని అవినాష్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాబలంతో గెలవ లేమని భావించి పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేశారని మండిపడ్డారు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఓటర్లను అడ్డుకోవడం, వైసీపీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవ స్థను అపహాస్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేసి టీడీపీ నాయకులు గెలుపొందారని ఆరోపించారు. ఇన్ని అక్రమాలు, అడ్డంకులు, అరాచకాల మధ్య వెలువడిన ఫలితాలను ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా చూడలేమని అవినాష్‌రెడ్డి అన్నారు. ఎన్నిక ల్లో అధికారికంగా ఓటమి ఎదురైనా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన వైసీపీదే అసలైన నైతిక విజయమని ఆయన స్పష్టం చేశారు.

పథకం ప్రకారమే పెట్రోల్ బాంబుల దాడులు!

- **అరాచకాలు సృష్టించింది వైసీపీ నేతలే.. నెపం టీడీపీపై నెట్టే ప్రయత్నం**
- **ఎంపీ అవినాష్‌రెడ్డి వ్యాఖ్యలకు బీటెక్ రవి కౌంటర్**



పులివెందుల, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను అడ్డుకునే లక్ష్యంతోనే పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామంలో పథకం ప్రకారం పెట్రోల్ బాంబులతో దాడులకు పాల్పడ్డారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆరోపించారు. అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది వైసీపీ నాయకులేనని, ఇప్పుడు తమకేమీ తెలియనట్లు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ.. నల్లపురెడ్డిపల్లెలో తమ నాయకుడు విజయకుమార్‌రెడ్డిపై దాడి చేసి, ఆయన వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. వేముల మండలంలో టీడీపీ నేత బాలస్వామిరెడ్డి దాడులకు పాల్పడ్డారంటూ వైసీపీ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలు గమనించారని తెలిపారు. అరాచకాలకు పాల్పడింది వైసీపీ నాయకులేనని ఆరోపించిన ఆయన, ఇప్పుడు ఆ ఘటనల నెపాన్ని టీడీపీపై నెట్టేందుకు ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టును ఆశ్రయించామని అవినాష్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీటెక్ రవి అన్నారు. ఎన్నికలు సజావుగా జరగకుండా అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు సాధ్యమైనన్ని ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి

- **ఓటర్లను భయపెట్టి, అబద్ధాలు ప్రచారం చేసి గెలవాలని వైసీపీ ప్రయత్నం..**
- **కడప, పులివెందులలో గొడవలకు కారణం జగన్ రెడ్డి**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



ఎంపీ అవినాష్ రెడ్డి, జగన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి సుమారు 95 శాతం విజయాల రేటుతో ప్రజలు మద్దతు తెలిపారని, అదే ఫలితాలు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయనే భయంతో వైసీపీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. కుప్పంలో బయటి ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకొచ్చి ఓట్లు వేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, తిరుపతిలో గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలో ఆధార్ కార్డులు ఇచ్చి సామాన్య ఓటర్లను తీసుకొచ్చి ఓట్లు వేయించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రామచంద్రపురంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి బలవంతం చేసిన ఘటనలు, పుంగనూరులో టీడీపీ కార్యకర్తపై దాడి, జమ్మలమడుగులో రామసుబ్బారెడ్డి కుమారుడి దౌర్జన్యం జరిగినట్లు ఆరోపించారు. రైల్వేకోడూరులో పెట్రోల్ బాంబు ఘటన, అనంతపురం పాఠశాల వద్ద పెట్రోల్ బాంబు ఘటనలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వచ్చి ఓటు వేయకుండా అడ్డుకునేందుకు పెట్రోల్ బాంబులు వేయడం, బూత్ క్యాప్చరింగ్, ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని సమీకరించడం వంటి చర్యలకు వైసీపీ పాల్పడుతోందని పల్లా ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుంటే పులివెందుల, పుంగనూరు వంటి ప్రాంతాల్లోనే ఘర్షణలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయో ప్రజలు ఆలోచించాలన్నారు. ఇది రాజకీయమా? రౌడీయిజమా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం నిబద్ధతతో ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తోందని, అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందలేక వైసీపీ అబద్ధాలు, అరాచకాలు, భయభ్రాంతుల ద్వారా ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని విమర్శించారు. ప్రజలు అరాచకాన్ని సహించరని, ముఖ్యంగా రాయలసీమ ప్రజలు హింసాత్మక రాజకీయాలను అంగీకరించరన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, జగన్ రెడ్డి దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. విద్వేషం, హింస ద్వారా ఓట్లు సాధించాలని ప్రయత్నిస్తే ప్రజలు తగిన విధంగా స్పందిస్తారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

నెల్లూరు కార్పొరేషన్‌లో జనసేనకు 100 శాతం విజయం

- **పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపు.. ఘనంగా విజయోత్సవ ర్యాలీ**
- **21వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి**



నెల్లూరు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించి 100 శాతం విజయ రికార్డును నమోదు చేసిందని జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయోత్సాహంలో భాగంగా నెల్లూరు నగరంలోని 21వ డివిజన్‌లో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన వీర మహిళ గునుకుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గుర్రాలమడుగు సంఘం నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విజయలక్ష్మి డివిజన్‌లోని ప్రజలను నేరుగా కలుసుకుంటూ తనను ఆదరించి, ఆశీర్వదించి కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదమే తన బలమని, ప్రజాసేవే తన లక్ష్యమని, 21వ డివిజన్ అభివృద్ధే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు విజయలక్ష్మికి ఘనస్వాగతం పలికి అభినందనలు తెలిపారు. విజయోత్సవ ర్యాలీతో గుర్రాలమడుగు సంఘం పరిసరాల్లో సందడి నెలకొంది. తన విజయానికి సహకరించిన ఓటర్లతో పాటు జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులకు విజయలక్ష్మి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, డివిజన్‌లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో కూటమి నాయకుల సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, వారి సూచనలు, సలహాలకు ప్రాధాన్యతనిస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం శ్రమించిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో జనసేన పార్టీ సాధించిన విజయాన్ని పవన్ కళ్యాణ్‌పై ప్రజలకున్న నమ్మకానికి, రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అందిస్తున్న ప్రజాసేవకు నిదర్శనంగా జనసేన నాయకుడు కిషోర్ గునుకుల అభివర్ణించారు. ఈ విజయోత్సవ ర్యాలీలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ చైర్‌పర్సన్, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ సతీమణి అనురాధ, జనసేన నాయకుడు కిషోర్ గునుకుల, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టాలి

- **ప్రజలతో ప్రతిక్షణం మమేకమవ్వాలి..**
- **జనసేన జిల్లా నేత కిలారి రోశయ్య**
- **30వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ళ శిరీష దంపతులకు ఘన సన్మానం**



విజయవాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : నవతరం నాయకత్వాన్ని సమాజానికి అందించాలనే లక్ష్యంతో జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువతకు, ముఖ్యంగా జెన్‌జీ తరానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జనసేన జిల్లా నాయకుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరూ పవన్ కళ్యాణ్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలతో ప్రతిక్షణం మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో 30వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించిన ఆళ్ళ శిరీష, ఆమె భర్తను కిలారి వెంకట రోశయ్య తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ డివిజన్ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీకి పట్టం కట్టి శిరీషకు భారీ మెజారిటీతో విజయాన్ని అందించారని తెలిపారు. ఈ గెలుపు జనసేన పార్టీకి మాత్రమే కాకుండా పవన్ కళ్యాణ్ ఆశయాలకు దక్కిన విజయమని అభివర్ణించారు. ప్రజలు అందించిన ఈ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి డివిజన్ అభివృద్ధికి శిరీష కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని రోశయ్య అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవాభావంతో పనిచేస్తే పార్టీకి మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. శిరీష విజయం రానున్న రోజుల్లో జనసేన పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ ఆళ్ళ శిరీష మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలుపునకు సహకరించిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు, డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చందు సాంబశివరావు, పాకనాటి రమాదేవి, మామిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించిన నెట్టెం రఘురాం

- **వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల సందర్శన..**
- **ఫోన్ ద్వారా అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల పరిస్థితులపై సమీక్ష**



జగ్గయ్యపేట, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని మాజీ మంత్రి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో పర్యటిస్తూ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటింగ్ సరళిని సమీక్షించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి ఎన్నికల పరిస్థితులను తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా కూడా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించారు. వత్సవాయి మండలంలోని వత్సవాయి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ కూటమి అభ్యర్థి వడ్లమూడి రాంబాబుతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించి, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల పరిస్థితులపై చర్చించారు. అదే మండలంలోని లింగాల గ్రామంలో జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు టీడీ జనార్ధన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, లింగాల సొసైటీ అధ్యక్షులు తొండేపు జగన్మోహన్ రావుతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. గౌరవరం గ్రామంలో నియోజకవర్గ పరిశీలకురాలు ఉండవల్లి శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, నాయకులు శ్రీరామ్, చిన్నబాబులతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై స్పందించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెనుగంచిప్రోలు మండలంలోని కొనకంచి, ముళ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కూటమి నాయకులతో కలిసి సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, ఓటర్లను నేరుగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల పరిస్థితులపై చర్చించారు. బండిపాలెం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఓటింగ్ సరళిని సమీక్షించారు. చిల్లకల్లు గ్రామంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కూడా నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా జరగాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సూచించారు.

ముగిసిన పోలింగ్‌కు ధన్యవాదాలు :

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఓటర్లకు, ఎన్నికల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు, విధులు నిర్వహించిన ఎన్నికల అధికారులు, సిబ్బందికి నెట్టెం రఘురాం ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో స్వయంగా పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించడంతో పాటు, ఫోన్ ద్వారా అన్ని గ్రామాల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ ఎన్నికల పోలింగ్ సరళిని సమగ్రంగా సమీక్షించారు.

నూతన మేయర్‌ను ఘనంగా సత్కరించిన కార్పొరేటర్లు

గుంటూరును నంబర్‌వన్ నగరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష



గుంటూరు, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : గుంటూరు నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి లక్ష్మీ అపర్ణను 35వ డివిజన్ కార్పొరేటర్ తాడిశెట్టి అమల, 42వ డివిజన్ కార్పొరేటర్ తాడిశెట్టి ఉత్తేజ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మేయర్‌గా గుంటూరు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి నంబర్‌వన్ నగరంగా తీర్చిదిద్దుతారనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన మేయర్ లక్ష్మీ అపర్ణ నగరంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన తాడిశెట్టి అమలను అభినందించారు. 35వ డివిజన్‌ను కూడా నంబర్‌వన్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ తాడిశెట్టి ఉత్తేజ్ తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి విదేశాల్లో ఉద్యోగం చేసిన తన కుమారుడు మాతృభూమికి సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని తాడిశెట్టి అమల అన్నారు. తన పెదనాన్న తాడిశెట్టి వెంకట్రావు, తండ్రి తాడిశెట్టి మురళీమోహన్ చూపిన మార్గంలోనే ఉత్తేజ్ కూడా రాజకీయంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలని మేయర్ లక్ష్మీ అపర్ణ ఆకాంక్షించారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చ కృష్ణమూర్తి, కొండేబోయిన శీను తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో వైసీపీ విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ!

- రాయలసీమలో అల్లర్లకు జగన్‌దే బాధ్యత..

- - బ్యాలెట్ బాక్సులు ధ్వంసం చేసి ప్రెస్ అటెన్షన్ కోసం కుట్రలు

- పోలింగ్ సమయంలో వైసీపీ దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు

- ఎమ్మెల్సీ వర్ల రామయ్య, పర్చూరి అశోక్‌బాబు, నీలాయపాలెం విజయకుమార్, బుచ్చి రాంప్రసాద్ ఫిర్యాదు



విజయవాడ, నవంబర్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిషత్ ఎన్నికల్లో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేయడంతో పాటు, పలు ప్రాంతాల్లో దౌర్జన్యాలు, హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేలా వైసీపీ శ్రేణులు వ్యవహరించాయని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు. ఈ ఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు టీడీపీ ప్రతినిధి బృందం గురువారం ఫిర్యాదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలను గుర్తించి మొత్తం 19 ఫిర్యాదులు అందజేసింది. దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను కూడా ఎన్నికల కమిషనర్‌కు సమర్పించింది. ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఈ ప్రతినిధి బృందంలో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించడం, ఓటర్లను అడ్డుకోవడం, ఎంపీటీసీ అభ్యర్థులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలపై ఎన్నికల సంఘానికి వివరించారు. ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసిన వారితో పాటు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్ ఆరాటంతోనే అడ్డదారులు : వర్ల రామయ్య

ఎన్నికల కమిషనర్‌ను కలిసిన అనంతరం ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒకటి చేసి రాజకీయంగా పరువు కాపాడుకోవాలనే ఆరాటంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో 151 అసెంబ్లీ స్థానాలు సాధించినప్పుడు 'వై నాట్ 175' అంటూ విర్రవీగిన జగన్.. అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితమైనా తన వైఖరిని మార్చుకోలేదన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీ పరిమితమైన విజయాలకే పరిమితమైందని పేర్కొన్నారు. పరిషత్ ఎన్నికల్లోనూ ఓటమి తప్పదనే భయంతోనే అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. పోలింగ్‌కు ముందు రోజు రాత్రి నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారని వర్ల రామయ్య ఆరోపించారు. సాధారణంగా తమకు ఓటు వేస్తారనే నమ్మకం ఉన్నవారికే డబ్బులు ఇస్తారని, అయితే ఈ ఎన్నికల్లో మాత్రం ఎక్కడా లేని విధంగా అందరికీ డబ్బులు పంచిపెట్టారన్నారు. ఉన్నట్టుండి ఇంత భారీ మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఈ అక్రమ ధన ప్రవాహం వెనుక ఉన్న మూలాలను గుర్తించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తమకు ఇంకా ఓటు బ్యాంకు ఉందనే భ్రమ కల్పించేందుకు కోట్లాది రూపాయలు వెదజల్లారని విమర్శించారు.

17 ప్రాంతాల్లో ఘటనలు.. 19 ఫిర్యాదులు :

రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు అరాచకాలకు పాల్పడినట్లు గుర్తించామని, వాటికి సంబంధించి ఎన్నికల సంఘానికి మొత్తం 19 ఫిర్యాదులు అందజేశామని వర్ల రామయ్య తెలిపారు. పోలింగ్ బూతుల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి ఓటర్లలో భయాందోళనలు సృష్టించారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో అందరి ముందే బ్యాలెట్ బాక్సులను బయటకు తెచ్చి ధ్వంసం చేశారని విమర్శించారు. శ్రీకాకుళంతో పాటు పలు ప్రాంతాల్లో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, వారి చొక్కాలు పట్టుకుని లాగారని ఆరోపించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగలేదని, రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని చూపించేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడులు సృష్టించారని వర్ల రామయ్య విమర్శించారు. ఎవరు ఎక్కువ అల్లర్లు, దౌర్జన్యాలు చేస్తే వారికి భవిష్యత్తులో అసెంబ్లీ సీట్లు ఇస్తామన్నట్లుగా జగన్ పార్టీ నాయకులను ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియో ఆధారాలను పెన్‌డ్రైవ్‌లో ఎన్నికల కమిషనర్‌కు అందజేశామని తెలిపారు. కేవలం ఆరోపణలతో సరిపెట్టకుండా, అందించిన ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.

సెలెక్షన్‌కు, ఎలక్షన్‌కు తేడా తెలియదా? :

జగన్‌మోహన్‌రెడ్డి పరిషత్ ఎన్నికలను 'సెలెక్షన్' అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని వర్ల రామయ్య విమర్శించారు. సెలెక్షన్‌కు, ఎలక్షన్‌కు తేడా తెలియని వ్యక్తి జగన్ అంటూ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసిందని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో వారిని ఎన్నుకున్నారని చెప్పారు. ప్రజలు తమను తిరస్కరిస్తున్నారనే అక్కసుతోనే జగన్ గంటల తరబడి మీడియా సమావేశాలు నిర్వహిస్తూ అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, అక్రమాల వెనుక వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే ప్రధాన సూత్రధారి అని వర్ల రామయ్య ఆరోపించారు. డబ్బుల పంపిణీకి ఆయనే నిధులు సమకూర్చారని, నేరాలకు పాల్పడేలా పార్టీ నాయకులను ప్రోత్సహించారని విమర్శించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : బుచ్చి రాంప్రసాద్

ఈ సందర్భంగా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణం కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత అని తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో అక్రమాలు, దాడులు, ఓటర్లను భయపెట్టే ఘటనలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదులను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిశీలించాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సమాన అవకాశాలు ఉండాలని, ఓటర్లపై ఒత్తిళ్లు తీసుకురావడం, డబ్బులు పంపిణీ చేయడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆధారాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ :

పరిషత్ ఎన్నికల సందర్భంగా జరిగినట్లు ఆరోపిస్తున్న దాడులు, డబ్బుల పంపిణీ, బ్యాలెట్ బాక్సుల ధ్వంసం వంటి ఘటనలపై సమగ్ర విచారణ జరగాలని టీడీపీ ప్రతినిధి బృందం కోరింది. హింసాకాండకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన వీడియో ఆధారాలు, లిఖితపూర్వక ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రాబోయే పంచాయతీ, పురపాలక ఎన్నికల్లోనైనా వైసీపీ నాయకులు తమ పద్ధతి మార్చుకోవాలని, చేతనైతే ప్రజాబలంతో ఎన్నికల బరిలోకి వచ్చి పోటీ చేయాలని వర్ల రామయ్య హితవు పలికారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

- పెదశంకర్లపూడిలో పోలింగ్ కేంద్రం పరిశీలన..

- ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపు



ప్రత్తిపాడు, నవంబర్ 5 (జనస్వరం) : ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని తన స్వగ్రామమైన పెదశంకర్లపూడిలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా తప్పని సరిగా వినియోగించుకోవాలని సూచించారు.

యలమంచిలి వైస్ ఛైర్మన్ పదవి టీడీపీకే ఇవ్వాలి

హోంమంత్రి వంగలపూడి అనితకు ప్రగడ నాగేశ్వరరావు విజ్ఞప్తి



యలమంచిలి, నవంబర్ 5 (జనస్వరం) : యలమంచిలి మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ పదవిని టీడీపీకే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. ఈ మేరకు గురువారం హోంమంత్రి వంగలపూడి అనితను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ నాగేశ్వరరావు, యలమంచిలి మున్సిపాలిటీలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ బలోపేతానికి, నియోజకవర్గంలో కూటమి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవిని టీడీపీ అభ్యర్థికే కేటాయించడం సమంజసమని విజ్ఞప్తి చేశారు. పార్టీ శ్రేణుల కృషిని గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా నియోజకవర్గంలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. అదే విధంగా మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు, స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు. ప్రగడ నాగేశ్వరరావు విజ్ఞప్తిపై స్పందించిన హోంమంత్రి వంగలపూడి అనిత, ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం, కూటమి పెద్దలతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చినట్లు ప్రగడ నాగేశ్వరరావు వెల్లడించారు.

హోంమంత్రి అనితను కలిసిన యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్

- పిల్లా రమాకుమారికి శుభాకాంక్షలు తెలిపిన వంగలపూడి అనిత..

- పట్టణ అభివృద్ధికి సహకరిస్తామని హామీ



యలమంచిలి, నవంబర్ 5 (జనస్వరం) : యలమంచిలి మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పిల్లా రమాకుమారి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పిల్లా రమాకుమారి ఆమెకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం జరిగిన ఈ సమావేశంలో యలమంచిలి పట్టణ అభివృద్ధి, మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాధాన్య పనులపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత నూతన చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారికి శుభాకాంక్షలు తెలియజేశారు. యలమంచిలి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

యలమంచిలి మండలంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- 76.91 శాతం ఓటింగ్ నమోదు..

- 20,422 మందికి గాను 15,706 మంది ఓటు వినియోగం



యలమంచిలి, నవంబర్ 5 (జనస్వరం) : మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 76.91 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం 20,422 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ ముగిసే సమయానికి 15,706 మంది ఓటు వేశారు. దీంతో మొత్తం 76.91 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. మండలంలోని ఏడు సెగ్మెంట్లకు సంబంధించి 15 మంది ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు ఒక జడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టారు. ఏడు సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల నిర్వహణ కోసం 120 మంది సహాయ పోలింగ్ అధికారులు, 75 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు మండలాన్ని రెండు జోన్లు, నాలుగు మార్గాలుగా విభజించి పర్యవేక్షణ చేపట్టారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో మండలంలో 76.91 శాతం ఓటింగ్ నమోదైంది.

నాలుగు మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

పలు పోలింగ్ కేంద్రాల సందర్శన.. ఎన్నికల నిర్వహణపై అధికారులతో ఆరా




ప్రత్తిపాడు, నవంబర్ 5 (జనస్వరం) : నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సరళిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కూటమి తరపున ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్న తీరును, ఓటర్ల స్పందనను, పోలింగ్ సరళిని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించిన మౌలిక సదుపాయాలను కూడా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులతో మాట్లాడి పోలింగ్ నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఎమ్మెల్యే సూచించారు. పోలింగ్ నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఎన్నికలు జరిగేలా సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

7న యలమంచిలిలో మూడు మండలాల ఓట్ల లెక్కింపు

- స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులు..

- రెండు కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



యలమంచిలి, నవంబర్ 5 (జనస్వరం) : స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగియడంతో ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మూడు మండలాల ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం పట్టణంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసాద్ తెలిపారు. యలమంచిలి మండలానికి సంబంధించి ఒక జడ్పీటీసీ, ఏడు ఎంపీటీసీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కోసం గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను ఈ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని, ఈ నెల 7న అక్కడే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా అచ్యుతాపురం మండలంలో ఒక జడ్పీటీసీ, 21 ఎంపీటీసీ సెగ్మెంట్లకు, రాంబిల్లి మండలంలో ఒక జడ్పీటీసీ, 14 ఎంపీటీసీ సెగ్మెంట్లకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు ప్రసాద్ తెలిపారు. ఈ రెండు మండలాల ఓట్ల లెక్కింపు కూడా ఈ నెల 7వ తేదీన ఇండోర్ స్టేడియంలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు మండలాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని యలమంచిలిలోని రెండు వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడంతో భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రెండు స్ట్రాంగ్ రూముల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అర్డీవో కె.వి. రామలక్ష్మి తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బ్యాలెట్ బాక్సులకు పటిష్ట భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.